
ప్రజాశక్తి
బుధవారం 19 ఫిబ్రవరి 2025
5
పార్వతీపురం మన్యం





వైసిపి అధినేత, మాజీ సిఎం జగన్మోహన్‌రెడ్డి.. గురువారం పాలకొండలో పర్యటించారు. జెడ్‌పి మాజీ చైర్మన్ పాలవలస రాజశేఖర్ కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా పాలకొండలో జగన్‌కు వైసిపి నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు.
- ప్రజాశక్తి, పాలకొండ



డిఎస్‌సి కోసం గురజాడ కళాభారతి ఆడిటోరియం బయట చదువుతున్న నిరుద్యోగ అభ్యర్థులు

ఊరిస్తున్న డిఎస్‌సి

ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ఇదిగో అదిగో అంటూ కొద్ది నెలలుగా ప్రభుత్వం నిరుద్యోగులను ఊరిస్తోంది. పోస్టుల భర్తీకి డిఎస్‌సి నోటిఫికేషన్ ప్రకటనలకే పరిమితమైంది. అధికారంలోకి వస్తే డిఎస్‌సి ఫైల్ పైనే తొలి సంతకం చేస్తామంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ ప్రకారం సంతకం చేసినా అది కార్యాచరణకు మాత్రం నోచుకోలేదు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తామంటూ చంద్రబాబు చెప్తుంటే, ఎమ్మెల్సీ ఎన్నికలు అయిపోయిన వెంటనే భర్తీ చేస్తామంటూ విద్యాశాఖ మంత్రి లోకేష్ ప్రకటిస్తున్నారు. జిల్లాలో ఎన్ని పోస్టులు ఉన్నాయో, ఎన్ని ఖాళీగా ఉన్నాయో ఇప్పటివరకు ఎటువంటి కసరత్తు జరగలేదని తెలుస్తోంది. నిరుద్యోగులు మాత్రం ఆశలు వదులుకోకుండా పుస్తకాలను ముందు వేసుకుని సాధన చేస్తునే ఉన్నారు.

- నోటిఫికేషన్ ఇదిగో, అదిగో .. అంటూ ప్రకటనలు
- కూటమి ప్రభుత్వం దాటవేత ధోరణి
- ఎనిమిది నెలల కిందటే ఫైల్‌పై సంతకం చేసిన సిఎం చంద్రబాబు
- జిల్లా నుంచి ప్రతిపాదనలే పంపని వైనం
- తీవ్ర నిరాశ, నిస్పృహలో నిరుద్యోగ అభ్యర్థులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉమ్మడి విజయనగరం జిల్లాలో 20 ప్రభుత్వ, ప్రైవేటు బిఇడి కళాశాలలు ఉన్నాయి. కోర్సు రెండేళ్ల కాలపరిమితి కావడంతో ప్రతి రెండేళ్లకు సుమారు 1000 మంది రిలీవ్ అవుతున్నారు. వీటితో పాటు 2 డిఇడి కళాశాలలు ఉన్నాయి. ఒక్కో కళాశాల నుంచి 50 మంది చొప్పున ప్రతి రెండేళ్లకు 400 మంది రిలీవ్ అవుతున్నారు. వీరు కాకుండా ఇప్పటికే బిఇడి, డిఇడి కోర్సులు పూర్తి చేసి ఉద్యోగాలు రాని వారు సుమారుగా 40 వేల మంది వరకు ఉన్నారు. టిడిపి హయాంలో 2018 అక్టోబరు 25న చివరిసారిగా నోటిఫికేషన్ వెలువడింది. ఆ తర్వాత ఉద్యోగ నియామకాలు జరగలేదు. గత వైసిపి ప్రభుత్వం హయాంలో 2023లో డిఎస్‌సి ద్వారా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తామంటూ ఏడాది పాటు ఊరించి 2024 ఫిబ్రవరిలో నోటిఫికేషన్ ఇచ్చారు. ప్రభుత్వం, అధికారులు అంతా ఎన్నికల ప్రక్రియలో నిమగ్నం కావడంతో ఆ నోటిఫికేషన్ కథ ముగిసింది. మొత్తమ్మీద సుమారు ఏడేళ్లగా ఉద్యోగాలెర్తీ కాలేదు. దీంతో వేలాది మంది నిరుద్యోగులు డిఎస్‌సి నోటిఫికేషన్ కోసం ఆత్రంగా ఎదురు చూస్తున్నారు. డిఎస్‌సి నోటిఫికేషన్ ఇస్తామని ప్రభుత్వం చెప్తున్నా, ఆ వైపుగా అడుగులు మాత్రం పడడం లేదు. నోటిఫికేషన్ కోసం జిల్లాల నుంచి వివరాలు సైతం తీసుకోలేదు. ఏడాదిన్నర కిందట అధికారులు పంపిన వివరాలు మినహా కొత్తగా ఏమీ పంపలేదు. దీంతో డిఎస్‌సి నోటిఫికేషన్ మాట ఉత్తదే అనే చర్చ సాగుతోంది.

ఏళ్ల తరబడి నిరుద్యోగుల సాధన

టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే డిఎస్ సి నోటిఫికేషన్ వస్తుందని నిరుద్యోగులు ఆశించారు. అంతా అనుకున్నట్లు గానే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నోటిఫికేషన్ పై తొలి సంతకం చేసి మరింత ఆశలు రేపారు. జూన్‌లో సంతకం చేయడంతో ఆగస్టు, సెప్టెంబర్‌లో నైనా నోటిఫికేషన్ వస్తుందని ఆశించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేసిన ప్రకటన విని అంతా తీవ్ర నిరాశకు లోనయ్యారు. వచ్చే విద్యా సంవత్సరం నాటికి ఉద్యోగాలను భర్తీ చేస్తామని ప్రభుత్వం చెప్పడంతో ఆశల పై నీళ్లు చల్లినట్లు అయింది. విశాఖ, శ్రీకాకుళం, విజయనగరం ఉమ్మడి జిల్లాల నుంచి వందలాది మంది అభ్యర్థులు విజయనగరంలోని పలు కోచింగ్ సెంటర్లలో శిక్షణ పొంది ప్రస్తుతం రూములు అద్దెకు తీసుకొని ఏళ్ల తరబడి చదువతున్నారు. మరికొంత మంది కృష్ణా జిల్లా అవనిగెడ్డలో శిక్షణ పొంది వచ్చి జిల్లా కేంద్రంలో ఉంటూ చదువుకుంటున్నారు. వీరంతా ఇళ్ల వద్ద, గ్రంథాలయాల వద్ద, పార్కుల్లోనూ డిఎస్‌సి కోసం సాధన సాగిస్తూనే ఉన్నారు. నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తున్న అభ్యర్థులకు ప్రభుత్వం ఏమి సమాధానం చెబుతుందో వేచి చూడాల్సిందే.

పెద్దఎత్తున ప్రచారం

డిఎస్‌సి నోటిఫికేషన్ పై ప్రభుత్వం టిడిపి నిరుద్యోగుల్లో ఆశలు రేపుతూనే ఉంది. జూన్‌లో ప్రారంభమయ్యే విద్యా సంవత్సరం నాటికి ఉద్యోగాలు భర్తీ చేస్తామంటూ చంద్రబాబు చెప్తున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే నోటిఫికేషన్ ఇస్తామంటూ విద్యాశాఖ మంత్రి లోకేష్ చెప్తున్నారు. ఉద్యోగాలు భర్తీ చేయకపోయినా డిఎస్‌సి నోటిఫికేషన్ ఇచ్చామంటూ ప్రచారం చేసుకుంటోంది. ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నామంటూ కూటమి ప్రభుత్వం చెప్పుకుంటోంది. రాష్ట్రంలో ఉత్తరాంధ్ర జిల్లాలు, కృష్ణా, గుంటూరు జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు ఉండడంతో డిఎస్‌సి నోటిఫికేషన్ పైనే మంత్రులు, ఎమ్మెల్యేలు మాట్లాడుతున్న పరిస్థితి నెలకొంది. ఆచరణలో నోటిఫికేషన్‌పై మీనమీషాలు లెక్కిస్తున్నారు.

మూడేళ్లుగా ఎదురు చూస్తున్నా



డిఎస్‌సి నోటిఫికేషన్ కోసం మూడేళ్లగా ఎదురు చూస్తున్నాను. 2022 నుంచి డిఎస్‌సి కోసం విజయనగరంలో అద్దెకు రూము తీసుకొని కోచింగ్ తీసుకొని చదువుకుంటున్నాను. ఇప్పటికే లక్షల రూపాయిలు ఖర్చు చేశాను. అయినా ప్రభుత్వం. డిఎస్‌సిపై స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడం లేదు. వెంటనే డిఎస్‌సి నోటిఫికేషన్ ఇచ్చి ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలి

- పి.నాగరాజు, పాడేరు, ఎఎస్‌ఆర్ జిల్లా

పోస్టులపై స్పష్టత లేదు..



టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధ్యాయ పోస్టులు 16 వేలకు పైగా భర్తీ చేస్తామని ప్రకటించింది తప్ప ఏ పోస్టులు ఎన్ని అనేది నేటికీ స్పష్టత లేదు. దీంతో డిఎస్‌సి ఉంటుందా లేదా అనే అనుమానం కలుగుతోంది. ప్రభుత్వం పోస్టుల భర్తీపై స్పష్టత ఇచ్చి, నోటిఫికేషన్ విడుదల చేయాలి.


- జామి పృథ్వీరాజ్, హిరమండలం, శ్రీకాకుళం జిల్లా

మాలాంటి పేదలతో ఆడుకోవద్దు



అధికారంలోకి వచ్చిన వెంటనే డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేసి, మెగా డిఎస్‌సి నిర్వహిస్తామని చెప్పి ఆరు నెలలైంది. జగన్మోహన్ రెడ్డి లాగా ఈ కూటమి ప్రభుత్వం కూడా ఏదో ఒక కారణం చెప్పి వాయిదా వేస్తూ వస్తుంది. ఇప్పటికే అవనిగడ్డ వెళ్లి కోచింగ్ తీసుకున్నాం. సిలబస్ మార్పు చేస్తూ మాతో ప్రభుత్వాలు ఆడుకుంటున్నాయి. సిలబస్ మారిన ప్రతి సారి కోచింగ్ తీసుకోవడం అంటే మా లాంటి పేదవారికి ఎలా సాధ్యం? ప్రభుత్వం వెంటనే నోటిఫికేషన్ ఇవ్వాలి.

- మేరి రాణి, వేపాడ, విజయనగరం జిల్లా



వైద్యాధికారుల సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

2 నెలల్లో యుపిహెచ్‌పిసిలు సిద్ధం కావాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో నిర్మాణ దశలో ఉన్న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (యు.పి.హెచ్.సి) రానున్న రెండు మాసాల్లోగా పూర్తిచేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. పార్వతీపురంలోని రెండు యుపిహెచ్‌సిలు ఈ నెలాఖరులోగా, సాలూరులోని యుపిహెచ్‌సి మార్చి నెలాఖరులోగా, పాలకొండ యుపిహెచ్‌సి ఏప్రిల్ మాసాంతానికి సిద్ధం కావాలని కలెక్టర్ తేల్చిచెప్పారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో యుపిహెచ్‌సిలపై వైద్యాధికారులు, మునిసిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగుల సేవల కోసం మంజూరైన యుపిహెచ్‌సిచ్‌సిలను వీలైనంత త్వరగా అందుబాటులోకి తీసుకురావాలన్నారు. మున్సిపల్ కమిషనర్లు ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ త్వరితగతిన పనులు పూర్తయ్యేలా పర్యవేక్షించాలన్నారు. అలాగే మురుగునీటి వ్యవస్థను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. బెలగాం లోని యుపిహెచ్‌సి ఎలక్ట్రికల్, ప్లంబింగ్, సెప్టిక్ ట్యాంక్ పనులు పెండింగ్ ఉండడంపై కలెక్టర్ ఆరా తీశారు. పూర్తిచేసిన పనులకు నిధులు ఎప్పటికప్పుడు విడుదలవుతున్నం దున త్వరగా పనులు పూర్తి చేయాలని సూచించారు. సాలూరు, పాలకొండ యుపిహెచ్‌సిలకు పనులు పెండింగ్‌లో ఉన్నందున వాటిపై దృష్టి సారించాలని, సాలురులోని మెంటాడ వీధిలో యుపిహెచ్‌సి నిర్మాణానికి టెండర్ ప్రక్రియ త్వరగా పూర్తిచేసి పనులు చేపట్టాలని ఆదేశించారు. ప్రతి వారం ప్రగతి ఫోటోలను తమకు సమర్పించాలని కలెక్టర్ తెలిపారు. ఎంఎస్‌ఎంఇల సర్వే మరింత వేగవంతం చేసి పూర్తిచేయాలని మున్సిపల్ కమిషనర్లను కలెక్టర్ ఆదేశించారు. ప్రతి మున్సిపాలిటీతో పాటు చుట్టు పక్కల పంచాయతీలను స్వచ్ఛతకు మారుపేరుగా నిలపాలని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. స్వచ్ఛసుందర పార్వతీపురంపై మార్చి 1నుంచి మాస్టర్ ట్రైనీలకు శిక్షణ ఇస్తామని, అందుకు తగిన పేర్లను సూచించాలని తెలిపారు. రోజూ రెండు పూటల పారిశుధ్యం చేపట్టేలా ప్రణాళికలు చేయాలని, చెత్తను సేకరించేందుకు వీలుగా తగిన సిబ్బంది, వాహనాలను సిద్ధం చేసుకోవాలని వివరించారు. సమావేశంలో వైద్య ఆరోగ్య శాఖ ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు, పార్వతీపురం, సాలూరు, పాలకొండ మున్సిపల్ కమిషనర్లు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఐసి ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్



నిరసన తెలుపుతున్న ఎల్ఐసి ఉద్యోగులు

స్థానిక ఎల్ఐసి కార్యాలయం వద్ద గురువారం ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ పిలుపు మేరకు గురువారం జీవిత బీమా ఉద్యోగులు ఒక గంట సమ్మె చేపట్టారు. పార్వతీపురం బేస్ యూనిట్ ప్రెసిడెంట్ ఆర్‌వి ప్రసాద్, సెక్రటరీ టెక్కలి ధర్మారావు మాట్లాడుతూ తక్షణమే క్లాస్ 3,4 ఉద్యోగుల నియామకం చేపట్టాలని, ఎఐఐఇఎకు గుర్తింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తక్షణమే రిక్రూట్మెంట్ చేయనిచో పోరాటాలకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. కార్యక్రమంలో పలువురు ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న తపాలాశాఖ ఉద్యోగులు

మూడో రోజు కొనసాగిన పోస్టల్ ఉద్యోగుల ఆందోళన

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

తపాలా శాఖలో జరుగుతున్న ప్రైవేటీకరణ చర్యలను వెంటనే ఆపాలని పోస్టల్ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా జెఎసి కార్యాచరణ సంఘం పిలుపు మేరకు మూడు రోజుల పాటు నల్లబ్యాడ్జీలు ధరించి నిర్వహించే నిరసన కార్యక్రమాల్లో భాగంగా గురువారం మూడోరోజు కూడా కొనసాగించారు. స్థానికప్రధాన పోస్ట్ ఆఫీస్ కార్యాలయం ఎదుట ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిడిఎస్ ఉద్యోగులకు 8వ పే కమిషన్ అమలు చేయాలని, కమలేష్ చంద్ర కమిటీలోని సానుకూల అంశాలను వెంటనే అమలు చేయాలని, ఐడిసిసిడిసి ప్రతిపాదనలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు రవీంద్రనాథ, బి.ఉమాశంకర్, ఎం.అప్పారావు, గౌరీశంకరావు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

చైర్మన్ పదవి కోసమేనా జంపింగ్‌లు

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్


వైసిపి ఖాతాలో ఉన్న మున్సిపాల్టీలను, కార్పొరేషన్లను, నగర పంచాయతీలను కూటమి ప్రభుత్వం తమ జమాలోకి వేసుకునేందుకు కౌన్సిలర్లను అనేక ప్రోలాభాలకు గురిచేస్తోంది. ఇందుకు నిదర్శనం ఇటీవల రాష్ట్రంలో వివిధ మున్సిపాల్టీల్లో జరిగిన పరిణామాలే. అయితే మన్యం జిల్లాలోని పాలకొండలో కూటమి ప్రభుత్వం ఆదిశగా పావులు కదిపినా, వారి పాచికలు పారడంలేదు. ఈనేపథ్యంలోనే పార్వతీపురం మున్సిపల్ చైర్మన్ పదవిపైనా కూటమి కన్నేసింది. అందుభాగంగానే పలువురు కౌన్సిలర్లను తమవైపు తిప్పుకునేందుకు చాపకింద నీరులా ప్రయత్నాలు చేస్తోంది. ఈనేపథ్యంలోనే గురువారం ముగ్గురు కౌన్సిలర్లు టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. వైసిపి హయాంలో గెలిచిన కౌన్సిలర్లు మూడున్నరేళ్ల అధికారం అనుభవించి, తీరా కూటమి ప్రభుత్వం గెలుపొందగానే టిడిపిలోకి చేరుతున్న వైనాన్ని పట్టణ ప్రజలు, రాజకీయ విశ్లేషకులు విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ చేరికలు చైర్మన్‌ను మార్చడానికి పావులు కదుపుతున్నారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

2021 మార్చిలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో పట్టణంలోని 30 వార్డులకు గానూ 24 వార్డుల్లో 16 మంది వైసిపి నుంచి, ఐదుగురు టిడిపి తరపున, ముగ్గురు ఇండిపెండెంట్లు గెలుపొందారు.

కౌన్సిలర్లు పార్టీ ఫిరాయింపులపై పలువురు అనుమానాలు

మార్చిలోనే ముహూర్తం!

దీంతో చైర్మన్, వైస్‌చైర్మన్ల పదవులు వైసిపి ఖాతాలో చేరాయి. పాలకపక్ష కౌన్సిల్ సభ్యులు అధికారాన్ని చేపట్టి మూడున్నరేళ్లు గడిచింది. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యేగా టిడిపి తరపున బోనెల విజయచంద్ర గెలుపొందడంతో రాజకీయాలు వేడెక్కాయి. సార్వత్రిక ఎన్నికలకు ముందే 26వ వార్డు వైసిపి కౌన్సిలర్ బెలగాం కరుణ భర్త బెలగాం జయప్రకాష్ నారాయణ టిడిపిలో చేరారు. అనంతరం ఎమ్మెల్యేగా గెలుపొందిన నాలుగు నెలల్లోనే ఐదుగురు వైసిపి కౌన్సిలర్లు, ఒక కో ఆప్షన్ సభ్యుడు టిడిపిలో చేరారు. తాజాగా గురువారం ముగ్గురు వైసిపి కౌన్సిలర్లు టిడిపి కండువా వేసుకున్నారు. దీంతో టిడిపికి చైర్మన్ పీఠం దక్కించుకునేందుకు బలం పెరిగింది. అలాగే ముగ్గురు ఇండిపెండెంట్ కౌన్సిర్లలో ఒకరు బిజెపి జిల్లా అధ్యక్షులు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు భార్య ద్వారపురెడ్డి జ్యోతి కూడా కూటమి కౌన్సిల్ సభ్యురాలి కింద లెక్క. ఆమెతో పాటు ఒక కౌన్సిల్ సభ్యులు టిడిపి పార్టీకి టచ్‌లో ఉన్నారు. ఈ నేపథ్యంలో వచ్చే మార్చిలో జరగనున్న కౌన్సిల్ సమావేశంలో చైర్మన్ మార్పు జరగనుందనే ప్రచారం జరుగుతోంది.



ఎమ్మెల్యే సమక్షంలో టిడిపిలో చేరిన వైసిపి కౌన్సిలర్లు

టిడిపిలో చేరిన వైసిపి కౌన్సిలర్లు

స్థానిక మున్సిపాలిటీలోని 19, 23, 24 వార్డులకు చెందిన వైసిపి కౌన్సిలర్లు తెలుగు బోదయ్య, మంత్రి ఉమామహేశ్వరి, మంత్రి రవికుమార్ గురువారం స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర నివాసంలో టిడిపి కండువాలు కప్పుకున్నారు. వైసిపి కౌన్సిలర్లు ముగ్గురూ ఒకేసారి పార్టీ మారడంతో పట్టణ ప్రజలతో పాటు, మున్సిపల్ కార్యాలయంలో ఉన్న పలు విభాగాల అధికారులలో చర్చనీయాంశమైంది. ఈ సందర్భంగా కౌన్సిలర్ మంత్రి రవికుమార్ మాట్లాడుతూ వైసిపి ఆవిర్భావ నుంచి పార్టీకి ఎన్నో సేవలందించానని, రెండు పర్యాయాలుగా కౌన్సిలర్‌గా ఎన్నికయ్యానని, అయితే కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని, సంక్షేమాలను చూసి తాము స్వచ్ఛందంగా పార్టీలోకి చేరామని అన్నారు.

సోషల్ మీడియా వినియోగంపై నిఘా : ఎస్‌పి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, టెలిగ్రామ్, యూట్యూబ్, ఎక్స్ (ట్విట్టర్) ఇతర సోషల్ మీడియాలో ఇతరులను కించపరిచేలా అసభ్యకరమైన, అనైతిక, అవమానకర రీతిలో పోస్టులు పెడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి,ఐపిఎస్ హెచ్చరించారు. సామాజిక మాధ్యమాల్లో సమాజంలోని ప్రముఖ వ్యక్తులపై, మహిళలపై, పిల్లలపైన, సంస్థలపై గాని హేయమైన, జుగుప్సాకరమైన పదజాలంతో ఫొటోలు, వీడియోలు మార్ఫింగ్, ట్రోలింగ్ చేసినా, వ్యక్తిగత దూషణలు, బెదిరింపులు, కించపరిచే వ్యాఖ్యలు చేస్తే బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఇతరుల మనోభావాలు, మానాభిమానులు దెబ్బతినేలాగానీ కుల, మత, రాజకీయ వర్గాల మధ్య విద్వేషాలు రగిల్చేలా, మతపరమైన, సున్నిత అంశాల్లో వదంతులు, అవాస్తవాలు ప్రచారం చేస్తూ శాంతి భద్రతలకు భంగం కలిగించేలా పోస్టులు పెట్టరాదని సూచించారు. సోషల్ మీడియాలో అసభ్యకరమైన, హేయమైన, విద్వేషకర పోస్టులు చేసే వారిపై, నిజానిజాలు తెలుసుకోకుండా వివాదాస్పద విషయాలు లేదా తప్పు దారి పట్టించే ఫేక్ న్యూస్ పెట్టినా షేర్ చేసే వారిపై, సంబంధిత గ్రూప్ అడ్మిన్లపై చట్ట ప్రకారం చర్యలు తప్పవన్నారు. సామజిక మాధ్యమాలలో ఒక వ్యక్తిని కించపరచాలని, వ్యక్తిత్వ హననానికి పాల్పడడం కోసం చేసే పోస్టల వల్ల అడ్మిన్ కూడా దానికి బాధ్యులు అవుతారని అందువల్ల అడ్మిన్లు కూడా జాగ్రత్త వహించాలని సూచించారు. సోషల్ మీడియాలో తప్పుడు, రెచ్చగొట్టే పోస్టులు పెట్టే వారిని పోలీసులు, సైబర్ సెల్ ,సోషల్ మీడియా టిమ్ ద్వారా నిరంతరం గమనిస్తూ ఉంటారని, కావున అప్రమత్తతో వ్యవహరించాలని, ముఖ్యంగా యువత, వారి భవిష్యత్తును అనవసర పోస్టుల ద్వారా బంగారు జీవితాన్ని నాశనం చేసుకోవద్దని, ఎస్పీ సూచించారు.

67 కేంద్రాల్లో టెన్త్ పరీక్షలు : డిఇఒ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మార్చి 17 నుంచి జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు జిల్లాలో 67 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్.తిరుపతినాయుడు తెలిపారు. గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీలో గురువారం పర్యటించిన సందర్భంగా ఆయన స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విలేకరులతో మాట్లాడారు. ఈ ఏడాది టెన్త్ పరీక్షలకు 10,455 మంది విద్యార్థులు హాజరు కానున్నారని, ఈ పరీక్షల పర్యవేక్షణకు మూడు ఫ్లయింగ్ స్క్వాడ్లను నియమించామని తెలిపారు. జిల్లాలో మూడు సమస్యాత్మక పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. 22 కస్టోడియ కేంద్రాలు గుర్తించామన్నారు. పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు వందరోజుల ప్రణాళికతో విద్యాబోధన జరుగుతుందన్నారు. ప్రత్యేక తరగతులు, వారాంతపు పరీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రతి ఆదివారం ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం 5గంటల గంటల వరకు ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆరోజు మధ్యాహ్న భోజనం ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. మై స్కూల్ మై ప్రైడ్ కార్యక్రమంలో భాగంగా 9,10 తరగతుల విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలిపారు. జిల్లాలో రక్తహీనతరహిత జిల్లాగా మార్చేందుకు జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ కృషి చేస్తున్నారన్నారు. ప్రతి విద్యార్థికి భవిత కార్డు ఇచ్చామన్నారు. విద్యార్థినిలకు నెలకొకసారి, విద్యార్థులకు మూడు నెలలకొకసారి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాల 121 స్కూల్ కాంప్లెక్స్ కస్టర్లను 75 క్లస్టర్లుగా కుదించామన్నారు. జిల్లాలో 262 ప్రాథమిక పాఠశాలలను మోడల్ స్కూల్స్‌గా చేర్చామన్నారు. ఒకే క్లాసులో 60 మంది విద్యార్థులు ఉంటే ఒక్కొక్క క్లాస్‌కు ఒక్కొక్క ఉపాధ్యాయుడు ఉంటారని తెలిపారు. ఎక్కువ మంది విద్యార్థులున్న చోట ఎయిడెడ్ పాఠశాలలను ప్రభుత్వ పాఠశాలలుగా విలీనం చేసేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని తెలిపారు. జిల్లా ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ప్రీ ఫైనల్ పరీక్షలను పరిశీలించారు. అనంతరం తాడికొండ, కొత్తగూడ గిరిజన సంక్షేమ పాఠశాలలను, భద్రగిరి పిటిజి పాఠశాలను సందర్శించారు. కార్యక్రమంలో ఎంఇఒ చంద్రశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డిఇఒ తిరుపతినాయుడు

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి • పలుచోట్ల విస్తృత ప్రచారం

ప్రజాశక్తి - నర్సీపట్నం టౌన్

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి జరుగుతున్న ఎన్నికల్లో తనను గెలిపిస్తే ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, మండలిలో ఉత్తరాంధ్ర వాణిని వినిపిస్తానని యుటిఎఫ్, పలు ఉపాధ్యాయ సంఘాలు బలపరిచిన పిడిఎఫ్ ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి అన్నారు. గురువారం ఆమె అనకాపల్లి జిల్లాలోని నర్సీపట్నం, మాకవరపాలెం మండలాల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఆమె వెంట జెవివి రాష్ట్ర నాయకులు కె.త్రిమూర్తులు రెడ్డి, యుటిఎఫ్ నాయకులు చిట్టయ్య, మోహన్, గాయత్రి, సిఐటియు నాయకులు అడిగర్ల రాజు ఉన్నారు.



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కె.విజయగౌరి

యుటిఎఫ్ మహిళా నాయకుల ప్రచారం

పార్వతీపురం : ఉపాధ్యాయుల సమస్యలపై పోరాడే పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరిని గెలిపించాలని కోరుతూ యుటిఎఫ్ జిల్లా మహిళా బృందం ప్రతినిధులు గురువారం ప్రచారం నిర్వహించారు. సీతానగరం మండలం జోగింపేట నుంచి సాలూరు మండలం కొత్తవలస వరకు 10 పాఠశాలను సందర్శించి పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరి గెలిపించాలని ప్రచార యాత్ర చేపట్టారు. ఉపాధ్యాయ హక్కుల కోసం పోరాటం చేసే అభ్యర్థిగా విజయగౌరికి మొట్టమొదటి ప్రాధాన్యత ఓటువేసి అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ప్రచారంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు వి.జ్యోతి, రాష్ట్రనాయకులు రాజమణి, జిల్లా కార్యవర్గ సభ్యులు అన్సారీ బేగం, మక్కువ మండలం సహాధ్యక్షులు ఎం.సంతోషి కుమారి, యుటిఎఫ్ మక్కువ మహిళా టీమ్ ఆర్ ఎన్‌వి శాంతి, ఎస్.గౌరి, కె.మణిదీపిక, ఎస్.శైలజ పాల్గొన్నారు.

పిడిఎఫ్ అభ్యర్థిని గెలిపించండి

సీతానగరం : ప్రజల పక్షాన పోరాడుతున్న పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ విజయ గౌరిని గెలిపించాలని యుటిఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు పి శ్రీనివాసరావు, టి ప్రసాద్ కోరారు. సీతానగరం సుంకర వీధి, పెదబోగిలి, బుడ్డిపేటలో ఉపాధ్యాయుల ఇళ్లకు వెళ్లి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరంతరం ఉపాధ్యాయ సమస్యలపైన పోరాడుతున్న విజయ్‌గౌరికి మద్దతు ఇవ్వాలని, మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘ నాయకులు రెడ్డి ఈశ్వరరావు, గవర వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

విజయ గౌరిని శాసనమండలి పంపాలి

సీతంపేట : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా కోరెడ్ల విజయగౌరిని శాసన మండలికి పంపాలని యుటిఎఫ్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె.ఆనందరావు, బి.ఫకీరు పిలుపునిచ్చారు. ఉద్యోగ, ఉపాధ్యాయ గొంతు వినిపించడానికి విజయగౌరి పోటీలో ఉన్నారని, కావున సమిష్టి సమస్యలుగా భావించి మన భవిష్యత్తు కోసం పిడిఎఫ్ బలపర్చి విజయగౌరిని గెలిపించాలని కోరారు.

బీమా చెక్కు అందజేత

ప్రజాశక్తి - కురుపాం

ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన పథకం లబ్ధిదారుకు శంబంగి పద్మావతికి రెండు లక్షల రూపాయల చెక్కును గురువారం కురుపాం ఎస్‌బిఐ బ్రాంచ్ మేనేజర్ ఎం.నరేష్ కుమార్ అందజేశారు. కురుపాం పంచాయతీ సీతంపేటకు చెందిన శంబంగి సింహాచలం మృతి చెందగా ఆయన ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన ఖాతాదారు కావడంతో ఆ బీమా మొత్తం ఆయన భార్య శంబంగి పద్మావతి కి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కష్టకాలంలో ఉన్న తమ కుటుంబాన్ని జీవనజ్యోతి బీమా యోజన పథకం ఆదుకుందని కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.


చెక్కును అందిస్తున్న మేనేజర్ నరేష్

విక్రంపురంలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని చిట్టిపూడివలస సచివాలయం పరిధి విక్రంపురంలో గురువారం స్థానిక వైద్యాధికారి బి.ప్రదీప్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలు, జ్వరపీడితులు, రక్తపోటు, మధుమేహం తదితర వ్యాధిగ్రస్తులకు వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది, రోగులు పాల్గొన్నారు.

కెజిబివి సందర్శన

ప్రజాశక్తి- సీతంపేట

మండల కేంద్రంలో ఉన్న కెజిబివి పాఠశాలలో నిర్వహిస్తున్న శిక్షణను సర్వ శిక్ష అభియాన్ ఎపిసి కోఆర్డినేటర్ తేజేశ్వరరావు గురువారం సందర్శించారు. అనంతరం అంగన వాడి కార్యకర్తలకు ట్రైనింగ్ ఎఫ్ఎల్ఎన్ శిక్షణ గురించి వివరిం చారు. పిల్లల శారీరక, మానసిక, ఉద్వేగా, బాషా, సంస్కృతిక అభివృద్ధి కార్యక్రమాలు మొదలగు విషయాలపై వివరించారు. ఈయనతో పాటు ఎంఇఒ ఆనందరావు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ రామచంద్రరావు

ఉపాధి పనుల్లో వేగం పెంచాలి : పీడీ

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

ఉపాధి పనుల్లో లక్ష్యం మేరకు ఫలితాలు సాధించేందుకు పనులలో వేగం పెంచాలని డ్వామా పీడీ కె. రామచంద్రరావు అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో సాలూరు, కురుపాం, పార్వతీపురం టిఎ, ఎఫ్ఎలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫార్మ్ ఫండ్, సోక్‌పిట్, ఇంకుడు గుంతల నిర్మాణాలలో లక్ష్యాలను చేరుకోవాలన్నారు. కనీస వేతనం 273 రూపాయలు తక్కువ కాకుండా పనుల లక్ష్యాలను ఏ రోజుకు ఆరోజు నిర్దేశించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎపిఒలతో పాటు ఎపిడి జి. శ్రీహరి, డిఎల్‌డిఒ రమేష్ రామన్ పాల్గొన్నారు.

పింఛన్ల పరిశీలన

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మండలంలోని జమదాలలో గురువారం పింఛన్ వెరిఫికేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపిడిఒ రమణమూర్తి పాల్గొని గ్రామంలో ఒంటరి మహిళలు, మృతి చెందిన వారి వివరాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి జగన్మోహన్ పాల్గొన్నారు.

పనులు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - సీతానగరం

పల్లె పండగ పనులు వేగవంతం చేయాలని ఎంపిడిఒ పి.త్రివిక్రమరావు అన్నారు. మండలంలోని బూర్జ, పెద అంకలాం గ్రామాలలో పల్లె పండగ పనులను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిసి రోడ్లు కాంపౌండ్ వాళ్ళు, గ్రావెల్ పనులు వేగవంతం చేయాలన్నారు. ఉపాధి పనులు ప్రతి ఒక్కరికీ ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామ సర్పంచులు జి.దాసు, బి. శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



పాపతో మాట్లాడుతున్న ఎంపిడిఒ రమేష్

అంగన్వాడీ కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జియమ్మవలస మండలం చినమేరంగి అంగన్వాడీ కేంద్రాన్ని ఎంపిడిఒ ఎస్.రమేష్ గురువారం పరిశీలించారు. చిన్నారులతో మాట్లాడి పిల్లల బోధనను పరిశీలించారు. ఆటపాటలతో విద్యా బోధన జరగాలన్నారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం సక్రమంగా అందించాలని సూచించారు. అనంతరం చినమేరంగి సచివాలయానికి వెళ్లి ప్రజలకు అందుతున్న సేవలు, సిబ్బంది విధులు అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని సూచించారు.

అక్కడ కాంట్రాక్టరే అధికారి

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని నడుకూరు గ్రామం నుంచి కిమ్మి గ్రామ వంతెన వరకు చేపడుతున్న బిటి రహదారి నిర్మాణ పనులు కాంట్రాక్టరే అధికారిగా వ్యవహరించి రహదారి నిర్మాణ పనులు చకచకా చేస్తున్నారు. రూ.30 లక్షల అంచనా వ్యయంతో రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యంలో రహదారి నిర్మాణ పనులు చేస్తున్నారు. పనుల నిర్మాణ సమయంలో అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్ల స్థానికుల నుండి విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే గుంతల రోడ్డుతో ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ వేసే ప్యాచ్ వర్క్ అయిన నాణ్యత కూడిన పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.


రోడ్డు వేస్తున్న కూలీలు

పేటెంట్ పొందేలా పంటల రూపకల్పన

ప్రజాశక్తి - గరుగుబిల్లి

ప్రతి రైతు పేటెంట్ పొందేలా పంటల రూపకల్పన చేయాలని నాబార్డ్ డి.డి.ఎం. దినేష్ రెడ్డి అన్నారు. రైతు సాధికార సంస్థ, వ్యవసాయ శాఖల భాగస్వామ్యంతో మండల పరిధిలోని జట్టు ట్రస్ట్ క్యాంపస్‌లో ప్రకృతి వ్యవసాయ రైతు శాస్త్రవేత్తలు, మెంటార్లకు ప్రతి నెల జరిగే నాలుగు రోజుల ప్రకృతి వ్యవసాయ పి.జి. డిప్లొమా కోర్సు శిక్షణ కార్యక్రమాన్ని ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విధానాలు ప్రతి ఒక్కరూ ఆచరించాలని తెలిపారు. రైతులు వినూత్నంగా ఆలోచన చేసి వారి స్థాయిలో నూతన వంగడాలను, ఉత్పత్తులను పెంపొందించాలని, వాటికి పేటెంట్ హక్కులు పొందాలని చెప్పారు. కొత్త విషయాన్ని అధ్యయనం చేసి, ఆచరించి, అనుభవం సంపాదించాక విస్తరణ చేయాలంటే ఎక్కువ సమయం పడుతుంది కావున సామాజిక మాధ్యమాల ద్వారా అనుభవాలు పంచుకోవడం ద్వారా జ్ఞానం త్వరగా విస్తరిస్తుందన్నారు. మనం తీసుకునే ఆహారంలో వైవిధ్యత ఉన్నట్లే పంటల్లో కూడా వైవిధ్యత అవసరమని అందుకోసం రైతులకు అవగాహన కల్పించాలని కోరారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలో కురుపాం మండలానికి చెందిన గొటివాడ గ్రామంలోని పంకాయ ఒకప్పుడు విస్తృత ప్రాచుర్యం పొందిందని ఇప్పుడు అది కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడుతుందని, దానిని మళ్ళీ ఇప్పుడు పునరుద్ధరణ చేసి పేటెంట్ హక్కులు పొందేలా చేయడం ద్వారా నిరంతరం ఆదాయం పొందగలమని తెలిపారు. ఒకప్పుడు ఎన్నో దేశీయ వరి రకాలు ఉండేవని వాటిని మళ్ళీ గుర్తించి వాటి సాగు విస్తీర్ణాన్ని పెంచేందుకు కృషి చేయాలని కోరారు. సాగు విస్తీర్ణం పెంచడంతో పాటు వినియోగం కూడా పెంచాలని తెలిపారు. ప్రతి రైతు కుటుంబం ప్రకృతి వ్యవసాయ విధానాలు అవలంబించాలని వారి ఉత్పత్తులను ప్రత్యేక ధరలు ఉండేలా చూడాలని అన్నారు. ప్రకృతి వ్యవసాయ విస్తరణ, ఆచరణలో మహిళలకు భాగస్వామ్యం కల్పించాలని కోరారు. 365 రోజులూ పంటలు ఉండేలా ప్రణాళిక చేసుకోవాలని తెలిపారు. జట్టు ట్రస్ట్ ముఖ్య సలహాదారు, రైతు సాధికార సంస్థ సీనియర్ సిలబస్ కన్సల్టెంట్ డాక్టర్. డి.పారి నాయుడు మాట్లాడుతూ రైతు శాస్త్రవేత్తలుగా మీరందరూ సాగు నీటి వసతి గల భూముల్లోను, వర్షాధార భూముల్లోనూ 365 రోజులు పంటల సాగు ఎలా సాధ్యపడుతుందో అధ్యయనం చేయాలని మెంటార్లను, రైతు శాస్త్రవేత్తలను కోరారు. అధ్యయనాల, అనుభవాల ఫలితాలే ప్రకృతి వ్యవసాయ విస్తరణకు ఉపకరిస్తాయన్నారు. ప్రకృతి వ్యవసాయ జిల్లా పాయింట్ పర్సన్ మంతిని మానస ప్రకృతి వ్యవసాయ పోస్ట్ గ్రాడ్యుయేషన్ డిప్లొమా కోర్సులు నిర్వహిస్తున్న విధానం, ఇంత వరకూ చేపట్టిన అధ్యయనాల ఫలితాలను వివరించారు. ప్రకృతి వ్యవసాయ కోర్సు మెంటార్ కమల, అప్పలనాయుడు వారి అనుభవాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో రైతు సాధికార సంస్థ బడి నుండి పొలం బడికి సిలబస్ కన్సల్టెంట్ తుంపలి శివాజీ, రాష్ట్రపతి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, విశ్రాంత ఉపాధ్యాయులు టి. శివ కేశవరావు, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన రైతు శాస్త్రవేత్తలు, మెంటర్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డిడిఎం దినేష్ రెడ్డి

జిల్లా స్థాయి వక్తృత్వ పోటీల్లో తృతీయ స్థానం

ప్రజాశక్తి - వీరఘట్టం


స్వర్ణాంధ్ర-2047లో భాగంగా పార్వతీపురంలోని కెపిఎం హైస్కూల్లో జరిగిన జిల్లాస్థాయి వక్తృత్వ పోటీల్లో మండలంలోని తలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న పాలకొండ ప్రియాంక తృతీయ స్థానం కైవసం చేసుకున్నట్లు ప్రధానోపాధ్యాయులు జగన్ గురువారం తెలిపారు. మన్యం జిల్లా అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఆర్.తేజేశ్వరరావు, ఎపిఒ వైకెబి హరిప్రసాద్ ప్రియాంకకు బహుమతిని అందజేశారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు కోఆర్డినేటర్ మాట్లాడుతూ తృతీయ స్థానం సాధించడానికి కృషి చేసిన సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు శంకర్రావు, రమణకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. అలాగే జాతీయస్థాయి సైన్స్ ఫెయిర్లో ద్వితీయ బహుమతి పొందిన జిల్లాకే గర్వకారణమని, ఇందుకు కృషి చేసిన జి.రామారావు, ప్రధానోపాధ్యాయులు జగన్‌కు, విద్యార్థులకు అభినందనలు తెలిపారు. మరిన్ని విజయాలు సాధించాలని విద్యార్థులను కోరారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

'జ్ఞానజ్యోతి'ని సద్వినియోగం చేసుకోవాలి : డిఇఒ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ప్రభుత్వం అంగన్వాడీ కార్యకర్తలకు అందిస్తున్న జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యా శాఖ అధికారి ఎన్.తిరుపతినాయుడు సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న జ్ఞానజ్యోతి శిక్షణా కేంద్రాన్ని ఆయన గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రంలో శిక్షణ పొందుతున్న అంగన్వాడీ కార్యకర్తలతో మాట్లాడారు. స్నేహభావ వాతావరణంలో చిన్నారులకు అంగన్వాడీ కార్యకర్తలే తల్లిగా వ్యవహరిస్తూ ఆటపాటలతో విద్యాబోధన చేపట్టాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అంగన్వాడీ ఉద్యోగులకు జ్ఞానజ్యోతి శిక్షణ అందిస్తుందని అన్నారు. స్నేహపూర్వక వాతావరణంలో ఆటపాటలతో విద్యాబోధన చేపట్టడం ద్వారా భయం వీడి ప్రతి పిల్లవాడు చదువు పట్ల ఆసక్తి కనబరుస్తారని తెలిపారు. అంగన్వాడీ వర్కర్లకు 120 రోజుల శిక్షణ తర్వాత సర్టిఫికెట్ అందిస్తారని అన్నారు. మొదట విడతగా ఆరు రోజులు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిక్షణ ఏ విధంగా ఉంది, ఎంత మేరకు నేర్చుకున్నారు వంటి అంశాలను అడిగి తెలుసుకున్నారు. శిక్షణ చాలా ఆసక్తిగా ఉందని, చాలా విషయాలను నేర్చుకున్నామని అంగన్వాడీ కార్యకర్తలు డిఇఒకు తెలిపారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి చంద్రశేఖర్, భద్రగిరి ఐసిడిఎస్ ఇన్చార్జి సిడిపిఒ పిఒ రాజ్యలక్ష్మి, జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం బిడ్డిక బీముడు, అంగన్వాడీ సూపర్వైజర్లు శ్రీదేవి, రేవతి, ఈశ్వరమ్మ, దౌలత్ ఉన్నిసా తదితరులు ఉన్నారు.

వీరఘట్టం : శిక్షణలో నేర్చుకున్న కృత్యాలు అంగన్వాడి కేంద్రాల్లో పిల్లలకు తప్పనిసరిగా నేర్పించాలని, సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఆర్.తేజేశ్వరరావు, సమగ్ర శిక్ష ఎపిఒ వైకెబి హరి ప్రసాద్‌రావులు అంగన్వాడి కార్యకర్తలకు సూచించారు. గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమాన్ని వారు పరిశీలించారు. 120 రోజులు జ్ఞానజ్యోతి కార్యక్రమంలో విద్యాభివృద్ధి, సమగ్రాభివృద్ధికి ఉపయోగపడే శారీరక, సామాజిక, భావోద్వేగా, మేధాభివృద్ధి, భాష, అక్షరాస్యత, సాంస్కృతిక, అభివృద్ధి గురించి వివరిస్తారన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి అంగన్వాడీ టీచర్స్ మూల స్తంభాలనీ, నాణ్యతతో కూడిన విద్యను అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌పిలు ఎం.పైడిరాజు, ఆర్.ధనుంజయ నాయుడు, బి.రాజేష్, సూపర్‌వైజర్లు రాజేశ్వరి, జ్ఞానమ్మ, ఎంఆర్‌సి సిబ్బంది, సిఆర్ఎంటిసి తదితరులు పాల్గొన్నారు.


వీరఘట్టం: మాట్లాడుతున్న సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ తేజేశ్వరరావు


సీతానగరం: మాట్లాడుతున్న ఎంఇఒ సూర్యదేముడు

అంగన్వాడీలకు శిక్షణ ముగింపు

సీతానగరం: మండలంలోని జోగంపేట కస్తూరిబా పాఠశాలలో అంగన్వాడి టీచర్లకు ఫస్ట్ విడత జ్ఞాన జ్యోతి శిక్షణా కార్యక్రమం గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఎంఇఒ జి సూర్యదేముడు మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు పాఠ్య పుస్తకాల ప్రాముఖ్యత, విద్యపట్ల ఆసక్తి కలిగించే అంశాలను ఆటపాటలతో అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ ఎం వెంకటరమణ, అంగన్వాడి సూపర్వైజర్ సురేఖ, కెవిపిలు గణపతి కూర్మనాయుడుతోపాటు అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట తప్పితే పోరాటానికి సిద్ధం

ప్రజాశక్తి - సాలూరురూరల్

తాము అధికారంలోకి ఇస్తే కార్మికుల సంక్షేమాన్ని చూస్తామని, ఉద్యోగ భద్రత కల్పించి, కాంట్రాక్టు కార్మికులు, ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చి అధికారం పొందిన కూటమి ప్రభుత్వం ఫిబ్రవరి 6న ఆప్కాస్‌ను రద్దు చేస్తామని రాష్ట్ర మంత్రివర్గం ప్రకటించడాన్ని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కమిటీ తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ మేకు సాలూరులో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో యూనియన్ జిల్లా సహాధ్యక్షులు డి.రాముడు, కార్యదర్శి కె.శంకర్రావు మాట్లాడారు. గతంలో మున్సిపాలిటీతో పాటు ఇతర శాఖల్లో థర్డ్ పార్టీ పేరుతో జీతాలు సరిగా ఇవ్వక, పిఎఫ్, ఇఎస్ఐ కార్మికుల ఖాతాలకు జమ చేయకుండా కాంట్రాక్టర్లు వారికి నచ్చినట్లు వ్యవహరించే వారిని అన్నారు. ఆప్కాస్ వచ్చిన తర్వాత ఈ సమస్య తగ్గిందని తెలిపారు. అధికారంలోకి ఇస్తే ఉద్యోగ భద్రత ఇస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలు మర్చిపోతే పోరాటానికి సిద్ధంగా ఉన్నామని గుర్తు చేశారు. ఆప్కాస్‌ను రద్దు చేస్తామన్నప్పుడు దానికన్నా మెరుగైన సౌకర్యాలు కల్పించే విధానాన్ని తీసుకురావాలి తప్ప, కార్మికులకు నష్టం తెచ్చే విధానాలను తీసుకొస్తే ఎలా అని ప్రశ్నించారు. ఇందుకు నిరసనగా కార్మికులు చేపట్టే ఆందోళనకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపారు. ఆప్కాస్‌లో ఉన్న లక్షమంది కార్మికులలో 45 వేల మంది మున్సిపల్ కార్మికులే ఉన్నారని తెలిపారు. ఎన్నికలకు ముందు 17 రోజుల సమ్మె సందర్భంగా అప్పటి అధికారులు, ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందాలు నేటికీ అమలు కావడం లేదని, దీనివల్ల ఇంజనీరింగ్ కార్మికుల జీతాలు పెరగలేదని, 60ఏళ్లు నిండిన వాళ్లకు బెనిఫిట్స్ రావడంలేదని, రిటైర్ వయస్సు 62ఏళ్లకు పెంచలేదని, దహన సంస్కరన ఖర్చులు రూ.20 వేలకు పెంచలేదని, కూటమి ప్రభుత్వానికి చేతనైతే ఇవి అమలు చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంపై ఈనెల 18 నుండి దశల వారీ ఆందోళనలు, ధర్నాలు, మార్చి 5న విజయవాడలో మహాధర్నా, 6న రాష్ట్ర వ్యాప్తంగా ఇంజనీరింగ్ కార్మికుల ధర్నాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో సాలూరు కమిటీ నాయకులు జి.శంకర్రావు, టి.పోలరాజు, జె.ఆదినారాయణ, కొట్టమ్మ, శామాలమ్మ పాల్గొన్నారు.

మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్


కరపత్రాలను విడుదల చేస్తున్న కార్మికులు, నాయకులు

రైతులకు విశిష్ట సంఖ్య నమోదు: ఎఒ

ప్రజాశక్తి- వీరఘట్టం

రైతులకు విశిష్ట సంఖ్య నమోదు కార్యక్రమం మండలంలోని అన్ని గ్రామాల్లో జరుగుతుందని ఎఒ.పిశ్రీదేవి తెలిపారు. విశిష్ట సంఖ్య నమోదు చేసుకోకపోయినట్లయితే 24వ తేదీన వేసిన పిఎం కిసాన్ సొమ్ములు జమ అయ్యే అవకాశం లేదన్నారు. రైతులు తమ గ్రామ వ్యవసాయ సహాయకుడిని సంప్రదించి, విశిష్ట సంఖ్య నమోదు చేయించుకోవాలన్నారు. ఇప్పటివరకు అన్ని విడతలలో జమైన వారు కూడా విశిష్ట సంఖ్య నమోదు చేయించుకోకపోతే పీఎం కిసాన్ సొమ్ము జమ కాదన్నారు. వెంటనే రైతు సేవా కేంద్రంలో ఆధార్, ఒన్‌బితో వెళ్లి ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. మండల పరిధిలోని రైతులందరూ ఈ విశిష్ట సంఖ్య నమోదు చేయించుకోవాలని కొరారు.

త్వరితగతిన రైతుల రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలి

ప్రజాశక్తి- పాచిపెంట

రైతులందరికీ త్వరితగతిన రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలని, ప్రతి రైతు విశిష్ట సంఖ్యను పొందాలని సాలూరు వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం మధుసూదన్‌రావు సూచించారు. స్థానిక మండల వ్యవసాయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గ్రామ వ్యవసాయ సహాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతానికి వెబ్‌ల్యాండ్‌లో ఉన్న అందరి రైతులకు విశిష్ట సంఖ్య నమోదును పూర్తి చేయాలని ఒకటి లేదా రెండు రోజులలో డి పట్టా, ఆర్వోఎఫ్ఆర్ భూములకు కూడా ఆప్షన్ వస్తుంది కాబట్టి గ్రామాలలో రైతులందరికీ విశిష్ట సంఖ్య పొందడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించాలన్నారు. పిఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, పంటల బీమా, పంట నష్ట పరిహారాలు, పంట రుణాలు, ఎరువులు, విత్తనాలు రాయితీలు పొందడానికి ఈ విశిష్ట సంఖ్య ఉపయోగపడుతుందని చెప్పారు. రైతులు వేసిన అన్ని పంటలను ఈ పంట ద్వారా నమోదు చేయాలని, ఎరువులు విత్తనాల పంపిణీ విషయమై జాగ్రత్తగా ఉండాలని కార్యాలయాలను శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వ్యవసాయ సహాయ సంచాలకులు మధుసూధనరావు

పేదలకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని దుడ్డుకల్లు పంచాయతీ బొడ్లగూడలో సుమారు వంద మంది పేద గిరిజనులకు గురువారం పార్వతీపురం మన్యం జిల్లా రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో దుప్పట్లు, దోమతెరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ చైర్మన్ డాక్టర్ మంచుపల్లి శ్రీరాములు మాట్లాడుతూ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు, టార్పాలిన్లు, దోమతెరలు, శానిటైజేషన్ కిట్లు పంపిణీ చేశామని తెలిపారు. మారుమూల గిరిజన ప్రజలకు వారి వ్యక్తిగత పరిశుభ్రత ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. పట్టణ ప్రాంతాల్లో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి రక్తనిధులు ఉంచుతూ అవసరమైన వాళ్లకి పంపిణీ చేస్తున్నామన్నారు. కలెక్టర్ సహకారంతో మరిన్ని సేవా కార్యక్రమాలు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పలువురు రెడ్‌క్రాస్ సభ్యులు పాల్గొన్నారు.


దుప్పట్లను పంపిణీ చేస్తున్న మంచుపల్లి శ్రీరాములు

ఉచిత కేన్సర్ శిబిరాన్ని వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉచిత కేన్సర్ వైద్య శిబిరాన్ని రోగులు వినియోగించుకోవాలని, స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. గురువారం స్థానిక మేజర్ పంచాయతీ కార్యాలయ ఆవరణలో విశాఖకు చెందిన ఒమేగా ఆసుపత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కేన్సర్ వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రమంతటా ఉచిత కేన్సర్ నిర్ధారణ పరీక్షలు చేస్తారని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు ఉదయాన ఉదయ భాస్కర్, బల్ల హరిబాబు, ఎస్ అచ్యుతరావు, ఎం. పుండరీకం, కె.పవన్ సాయి తదితరులు పాల్గొన్నారు.


శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ

బాల్యవివాహాలను నిర్మూలించాలి

ప్రజాశక్తి - సీతంపేట

అందరి సమిష్టి కృషితోనే బాల్య వివాహనాలను నిర్మూలించవచ్చునని సిపిడిఒ పి.రంగలక్ష్మి అన్నారు. గురువారం స్థానిక బాలికల ఆశ్రమ హైస్కూల్‌లో లైంగిక దాడులు, బాల్యవివాహాల నివారణపై అవగాహన కల్పించారు. బాలికల ఆరోగ్యం, విద్య, పౌష్టిక ఆహారం గురించి వివరించారు. ఈ సందర్భంగా రంగలక్ష్మి మాట్లాడుతూ ఈ ఏజెన్సీలో బాలికలు అప్రమత్తంగా ఉండాలని ఏ వ్యక్తిని కూడా అపరిచితుల్ని నమ్మ కూడదని బాలికలు మోసపోవద్దని గుర్తు చేశారు. జిల్లా బాలల సంరక్షణ విభాగం లీగల్ ప్రొబెషన్ ఆఫీసర్ పారిశర్ల శ్రీధర్ మాట్లాడుతూ మహిళా, శిశుసంక్షేమ శాఖ పరిధిలో జరుగుతున్న కార్యక్రమాలను వివరిస్తూ ఫోక్సో చట్టం కోసం అవగాహన కల్పించారు. బాలికల పట్ల చెడు, మంచి స్పర్శ -లైంగిక దాడులు చేస్తే శిక్షలు ఏ విధంగా ఉంటాయనేది అవగాహన కల్పించారు. బాల్య వివాహాల నిర్మూలన, ఈ వివాహాల వల్ల బాలికలకు కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు చేస్తే ఎటువంటి శిక్షలు ఉంటాయో అవగాహన కల్పించారు. బాలల సంరక్షణ, సంక్షేమం, పిల్లల్లేని తల్లిదండ్రులకు పిల్లలను దత్తత తీసుకొని తెలియజేశారు. మహిళలపై గృహింస, వరకట్న వేధింపులు, వారిపై జరుగుతున్న దాడుల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ సూపర్వైజర్లు ఎస్. విస్సమ్మ, జి.గౌరమ్మ, ఎం.లావణ్య, మహిళా సంరక్షణ అధికారులు కమల, శిరీష, ఆశ్రమ హైస్కూల్ హెచ్ఎం టి.వసంత లక్ష్మి, హెచ్‌డబ్ల్యుఒ పాలక అమల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పిఒ రంగలక్ష్మి

పల్లె పండగ పనులు శత శాతం పూర్తికావాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో పల్లె పండుగ కింద మంజూరైన పనులన్నీ శత శాతం పూర్తికావాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పేర్కొన్నారు. గురువారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో పల్లె పండుగ పనులపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధిహామీ చట్టంలో భాగంగా పల్లె పండుగ కింద చేపట్టిన పనులన్నీ ఈ నెలాఖరుకు పూర్తిచేయాలన్నారు. పూర్తిచేసిన పనులకు ఎప్పటికపుడు బిల్లులు అప్లోడ్ చేయాలని అధికారులకు ఆదేశించారు. మండలాల వారీగా మంజూరైన, పూర్తయిన పనులు, బిల్లులు మంజూరు, పెండింగ్ పనుల గురించి అడిగి తెలుసుకున్న కలెక్టర్ ఎట్టి పరిస్థితిల్లోనూ ఈనెలాఖరుకు శతశాతం పనులు పూర్తికావాల్సిందేనని తేల్చిచెప్పారు. అనుమతించిన పనులతో పాటు ప్రభుత్వం మంజూరు చేసిన ప్రతి రూపాయి ఖర్చు చేయాల్సిందేనన్నారు. కురుపాంలో పనులు వేగవంతం కావడం లేదని, దీనిపై ఇంజినీరింగ్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనుమతి మంజూరు చేసినప్పటికీ పనులు ప్రారంభించని గుత్తేదారుని రద్దుచేసి, వేరే గుత్తేదారునితో పనులు చేపట్టాలన్నారు. అప్పగించిన లక్ష్యాలపై ఇంజినీర్లు ప్రత్యేక శ్రద్ధ వహించి పూర్తిచేయాలని స్పష్టం చేశారు. రోజువారీ ప్రగతి వివరాలను తమకు సమర్పించాలన్నారు. బిటి, సిసి రోడ్లలో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని, నాణ్యత లోపం ఉంటే చెల్లింపులు జరగబోవని హెచ్చరించారు. ఇప్పటి వరకు పూర్తిచేసిన పనులకు సంబంధించిన బిల్లులను ఎప్పటికప్పుడు ఆన్ లైన్‌నందు అప్ లోడ్ చేయాలని తేల్చి చెప్పారు.

22లోగా ప్రహరీగోడ నిర్మాణ పనులు ప్రారంభం కావాలి

ఉపాధి హామీ చట్టం కింద జిల్లాలో చేపట్టిన పనులన్నీ వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. మినీ గోకులాలు, ప్రహరీగోడలు, ఫారంపండ్స్, ఫిష్‌పాండ్స్, రహదారులు తదితర పనుల్లో ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలన్నారు. ఇప్పటివరకు అనుమతి మంజూరు ఉత్తర్వులు పొందిన ప్రహరీ గోడల నిర్మాణాలన్నీ ఈనెల 22 నాటికి గ్రౌండింగ్ కావాలని తేల్చిచెప్పారు. ప్రారంభం కాని పక్షంలో నిర్మాణ పనుల అనుమతులను రద్దుచేస్తామన్నారు. ఉపాధిహామీలో జిల్లా ప్రథమ స్థానంలో ఉండేలా అధికారులు కృషి చేయాలన్నారు. ముఖ్యంగా జియమ్మవలస మండలంలో పనులు గ్రౌండింగ్ కావాలని, అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. చేసిన పనులకు ఈనెల 25లోగా బిల్లులు సమర్పించాలని ఆదేశించారు. జిల్లాలో ఎంఎస్ఎంఇ సర్వేలో 45 శాతం పూర్తయిందని, మిగిలిన వాటిని కూడా త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. గిరిజన ప్రాంతాల్లో ఆర్థిక లావాదేవీలు జరిగిన చిన్న, మధ్య తరహా పరిశ్రమలను కూడా సర్వేలో తీసుకోవాలని స్పష్టం చేశారు. సమావేశంలో డ్వామా పీడీ కె.రామచంద్ర రావు, జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి బి.చంద్రశేఖర్, ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీరింగ్ అధికారిప్రభాకరరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - పాలకొండ

11 కెవి నవగాం ఫీడర్ నిర్వహణ పనులు శుక్రవారం చేపడుతున్నందున మండలంలోని పనుకువలస, తుమరాడ, చింతాడ, దుగ్గి, నక్కపేట, అట్టలవాటపాగు, టిడి పారాపురం, టికె రాజపురం ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఇఇ టీజీకే మూర్తి తెలిపారు. ఈ అంతరాయాన్ని వినియోగదారులు గమనించాలని కోరారు.

గుమ్మలక్ష్మీపురం : మండల కేంద్రంలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు ఎలక్ట్రికల్ ఎఇ రవికుమార్ తెలిపారు. విద్యుత్ వైర్లకు అడ్డంగా ఉన్న చెట్లను, కొమ్మలను తొలగిస్తున్న మేరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గ్రహించి ఉదయం 8 గంటలలోపు మంచినీటి బోర్లను వేసుకుని అంతరాయుం లేకుండా చూసుకోవాలని కోరారు.